సాక్షి
రంగారెడ్డి
శనివారం । 15 । ఫిబ్రవరి । 2025




ఆ ఇద్దరూ అమన్, అలోక్!

జీదర్, అఫ్జల్‌గంజ్‌లో తుపాకులతో విరుచుకుపడిన ఇద్దరు దుండగులు అమన్ కుమార్, అలోక్ కుమార్‌గా తేలింది. 8లో▸



పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

నేటికీ పేదలు గూడు కోసం పోరు చేయాల్సిన దుస్థితి ఉందని సీపీఐ కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. 8లో▸



ఆర్టీసీ బస్సు లారీ ఢీ

ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 8లో▸

న్యూస్‌రీల్

400 టన్నుల ఇసుక సీజ్

- పది మందిపై కేసు నమోదు
- ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణాతోపాటు, పలుచోట్ల డంప్ చేసి విక్రయిస్తున్న వారిపై పోలీసులు డేగ కన్ను పెట్టారు. ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం పీఎస్‌ల పరిధిలో 15 మందిపై కేసులు నమోదు చేసి సుమారు 400 టన్నుల ఇసుకను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం పరిధిలో ఇసుక డంప్ చేసి విక్రయిస్తున్న పది మందిపై కేసులు నమోదు చేసి 300 టన్నుల ఇసుక, ఆదిబట్ల పీఎస్ పరిధిలో ఐదుగురిపై కేసు నమోదు చేసి సుమారు 100 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిల్వలను తహసీల్దార్‌కు అప్పగించామని చెప్పారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, అక్రమంగా విక్రయించినా, డంప్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈము రైతులకు రుణ విముక్తి కల్పించండి



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన వెంకటేశ్వర్‌రెడ్డి

షాద్‌నగర్: ఈము రైతులకు ప్రభుత్వం రుణ విముక్తి కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన నాబార్డు స్టేట్ క్రెడిట్ సెమినార్‌కు హాజరైన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. వ్యవసాయానికి అనుబంధంగా, లాభసాటిగా ఉంటుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించడంతో 15 ఏళ్ల క్రితం ఈము పక్షుల పెంపకం చేపట్టామన్నారు. ఇందుకోసం నాబార్డు సహకారంతో సబ్సిడీ కింద రుణాలు పొందామని స్పష్టంచేశారు. ఆశించిన స్థాయిలో లాభాలు, మార్కెట్ లేకపోవడంతో చాలా మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకపోయారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈము రైతులకు సంబంధించి ఆయా బ్యాంకుల్లో సుమారు రూ.14 కోట్ల రుణాలు ఉన్నాయని, వీటిని మాఫీ చేసి విముక్తి కల్పించాలని కోరారు.

మహిళా సమాఖ్యలో సీసీలు, ఏపీఎంలకు శిక్షణ



కందుకూరులో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత


కందుకూరు: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఫుడ్ న్యూట్రీషన్ హెల్త్ వాష్(ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యూ) కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన సెర్ప్ సీసీలు, ఏపీఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ శ్రీలత మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని. భోజనం చేసేముందు చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. అన్ని స్వయం సహాయక సంఘాలకు ఈ అంశాలను వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం నర్సింహ, యాదయ్య, బాలరాజు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు గిరిజన విద్యార్థి రంజిత్

యాలాల: డిస్కస్ త్రో విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు మండల పరిధిలోని దేవనూరు అనుబంధ గ్రామం దుబ్బతండాకు చెందిన రంజిత్‌కుమార్ ఎంపికయ్యాడు. వికారాబాద్‌లో పాలిటెక్నిక్ చదువుతున్న రంజిత్‌కుమార్ ఫిబ్రవరి 12న నగరంలోని రామంతాపూర్‌లో నిర్వహించిన స్టేట్ లెవల్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో ఆయన్ను దక్షిణ భారత దేశం నుంచి జాతీయ స్థాయి డిస్కస్ త్రో పోటీలకు అర్హత సాధించాడు. డిస్కస్ త్రోలో సౌత్ జోన్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన దుబ్బతండా గిరిజన విద్యార్థికి మండలంలోని నాయకులు, యువకులు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రంతో పాటు తండాకు మంచిపేరు తీసుకురావాలని పట్టుదలతో ముందుకు సాగుతున్నట్లు రంజిత్‌కుమార్ పేర్కొన్నారు.

ఇస్తే సరి.. లేదంటే కిరికిరి!

కరెంటోళ్లకు కామధేనువులా మారిన కొత్త కనెక్షన్లు



- మంచాల మండలంలోని ఓ వెంచర్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న 11కేవీ, 33కేవీ లైన్‌షిఫ్టింగ్ వర్క్స్ సహా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం సరూర్‌నగర్ సర్కిల్ ఎలక్ట్రికల్ (టెక్నికల్) డివిజనల్ ఇంజనీర్ (డీఈ) టి.రామ్మోహన్ డబ్బులు డిమాండ్ చేశారు. అనంతరం సదరు కాంట్రాక్టర్ నుంచి రూ.18 వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.
- 2024 నవంబర్ 25న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఘట్‌కేసర్ మండలం ఏఈ బలరాంనాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌నాయక్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు.
- ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా గచ్చిబౌలి ఏడీఈ అందె రాములు ఇటీవల ఏసీబీ పన్నిన వలలో ఇరుక్కున్నారు.
- తాజాగా శుక్రవారం ఇదే ప్రాంతానికి చెందిన మరో ఏడీఈ సతీష్‌కుమార్ డీటీఆర్ మంజూరుకు కాంట్రాక్టర్ నుంచి రూ.75 వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- ఇలా తరచూ ఎవరో ఒకరు ఏసీబీకి పట్టుబడుతూనే ఉన్నారు. అరెస్టయి జైలుకు వెళ్లి వచ్చినా కొంతమంది ఇంజనీర్లలో మార్పు రావడం లేదు.

- విద్యుత్ శాఖలో ఒక్కో పనికి ఒక్కో రేటు
- చేయి తడపందే కదలని పనులు
- మొన్న సరూర్‌నగర్ టెక్నికల్ డీఈ, నిన్న కోళ్లకల్ ఏఈ, తాజాగా గచ్చిబౌలి ఏడీఈ
- తరచూ ఏసీబీకి పట్టుబడుతున్న ఇంజనీర్లు
- అయినా ఆగని అక్రమ వసూళ్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కొత్తలైన్లు, లైన్ షిఫ్టింగ్ పనులు, మీటర్లు, డీటీఆర్‌లు, ప్యానల్ బోర్డులు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. నిబంధనల మేరకు లోడును బట్టి ఫీజులు చెల్లిస్తున్నా.. క్షేత్రస్థాయిలోని ఆర్టిజన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఏఈ, ఏడీఈ, డీఈ ఇలా ఎవరి స్థాయిలో వారికి చేయి తడపనిదే పని కావడం లేదు. నిరాకరించిన వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. అధికారుల తీరుతో విసుగు చెందిన వినియోగదారులు చివరకు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ప్రతి నెలా ఎవరో ఒకరు ఏసీబీకి పట్టుబడుతూనే ఉన్నారు. అయినా.. అక్రమార్కుల వైఖరిలో మాత్రం మార్పు రావడం లేదు. నిజానికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలతో పోలిస్తే డిస్కం ఇంజనీర్ల వేతనాలు చాలా ఎక్కువే. ఒక్కో డీఈకి సీనియార్టీని బట్టి నెలకు రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు వేతనం అందుతోంది. సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్ల వేతనాలు కూడా రూ.లక్షకు పైమాటే. ప్రభుత్వం వీరికి భారీగా వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ.. కొంత మంది అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రతీ పనికి ఓ రేటు ఫిక్స్ చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా ఫోకల్, నాన్ ఫోకల్ అనే పేరుతో పోస్టులను సృష్టించి పోస్టింగ్ కోసం చేసిన ఖర్చులను తిరిగి రాబట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటుపడి అవినీతి నిరోధకశాఖ వలలో చిక్కుకుంటున్నారు. ప్రత్యక్షంగా తమ భవిష్యత్తును పాడు చేసుకుంటూ పరోక్షంగా సంస్థకు ఉన్న ఇమేజ్‌ని కూడా దెబ్బతీస్తున్నారు. ఏసీబీకి చిక్కిన వారు ఆ తర్వాత అంతకంటే పెద్ద పోస్టుల్లో చేరుతుండటం గమనార్హం.

కొత్తకనెక్షన్లతో కాసుల వర్షం

ఔటర్‌కు అటు ఇటుగా అనేక బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు వెలుస్తున్నాయి. కొత్త మీటర్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రతి నెలా 2,500 మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో 250 మంది ప్యానల్ బోర్డుల కోసం, వంద మంది వరకు డీటీఆర్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. భారీ బహుళ అంతస్తుల భవనాలకు హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, ఫైర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ విభాగాల నుంచి ఎన్‌ఓసీలు తప్పనిసరి. చాలా మంది ఆయా విభాగాల నుంచి అనుమతి తీసుకోక పోవడం, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడుతుండటం వీరికి కలిసి వస్తోంది. ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకి రూ.2 లక్షలు, వెంచర్‌లో కొత్త లైన్ల ఏర్పాటుకు రూ.5 లక్షలకుపైగా డిమాండ్ చేస్తున్నారు. ఇక భూదాన్, వక్ఫ్‌బోర్డు, దేవాదాయశాఖ, అసైన్డ్, ప్రభుత్వ భూములు, 111 జీఓ పరిధిలో చేపట్టే పలు నిర్మాణాలు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. వీరు ప్రత్యక్షంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ.. పరోక్షంగా ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి కారణమవుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

విధిలేక ఏసీబీ వద్దకు..

విద్యుత్ శాఖలో పాతుకుపోయిన అవినీతి, అక్రమ వసూళ్లను పూర్తిగా నియంత్రించి, పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు సీఎండీ ముషారఫ్ ఫారూఖీ గత సెప్టెంబర్‌లో 04023454884, 7680901912 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. స్టిక్కర్లు, వాల్ పోస్టర్లు ముద్రించి ప్రతి సెక్షన్/సబ్‌స్టేషన్/ ఈఆర్‌ఓ కేంద్రాల్లోనూ అంటించారు. తొలి రోజే 40 ఫిర్యాదులు అందాయి. విచారించి పలువురు ఇంజనీర్లకు షోకాజు నోటీసులు కూడా జారీ చేశారు. సంస్థాగతంగా పలు మార్పులు చేశారు. అయినా అక్రమ వసూళ్లు మాత్రం తగ్గకపోగా, మరింత పెరుగుతున్నాయి. ముఖ్యంగా సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, మేడ్చల్, సంగారెడ్డి, సరూర్ నగర్ సర్కిళ్ల పరిధిలో పని చేస్తున్న కొంత మంది ఇంజనీర్లపైనే ఎక్కువ ఆరోపణలు వెల్లువెత్తుతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. విధిలేని పరిస్థితుల్లో బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తుండటం విశేషం. తాజాగా గచ్చిబౌలి ఏడీఈ సతీష్ ఓ కాంట్రాక్టర్ నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీ చిక్కడం చర్చనీయాంశంగా మారింది.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

రైతు లేనిదే రాజ్యం లేదు

- కర్షకుల ప్రయోజనమే ముఖ్యం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- హైదరాబాద్ డీసీసీబీ బ్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం రూరల్: అన్నంపెట్టే అన్నదాత లేనిదే రాజ్యం లేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్యతో కలిసి హైదరాబాద్ డీసీసీబీ బ్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాకు డీసీసీబీ బ్యాంకు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఎకరా స్థలంలో రూ.10 కోట్లతో అత్యాధునికంగా భవనం నిర్మిస్తే.. రూ.100 కోట్ల ఆస్తి అవుతుందని తెలిపారు. 9 నెలల్లో నిర్మాణం పూర్తిచేసి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుతం బ్యాంకు రూ.600 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల టర్నోవర్‌తో కొనసాగుతుందని తెలిపారు. నాలుగు జిల్లాల కర్షకులకు కష్టకాలంలో నిధులు సమకూరుస్తూ.. అండగా నిలుస్తుందని వెల్లడించారు. రుణాలు, వడ్డీలు ముఖ్యం కాదని, రైతుల ప్రయోజనమేనని స్పష్టంచేశారు. దేశంలో అతిపెద్ద మార్కెట్ బాటసింగారంలో నిర్మిస్తున్నట్లు వివరించారు.

ఆదర్శ డీసీసీబీగా నిలపాలి

'గతంలో డీసీసీబీలో అప్పు తీసుకుంటే భయం ఉండేది. ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రుణాలు ఇచ్చి రైతులను ఆదుకుంటున్నాం. కొన్నేళ్లుగా ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నాం. డీసీసీబీలను టెస్కాబ్‌కు అనుసంధానం చేసి ఆధునీకీకరించాము' అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రతి సొసైటీకి రూ.50 లక్షల రుణాలు ఇచ్చి, ఆదుకుంటూ ముందుకు తీసుకెళ్లామని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలోనే ఆదర్శ వంతమైన డీసీసీబీగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, సీఈఓ భాస్కర్ సుబ్రహ్మణ్యం, డీసీఓ సుధాకర్, జీఎంలు ప్రభాకర్‌రెడ్డి, శ్రీరామ్, డీజీఎంలు కిరణ్‌కుమార్, సతీష్‌రెడ్డి, నాగాంజలి, ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, ఈసీ శేఖర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, సీఈఓలు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడిని ఖండిస్తున్నాం



రంగరాజన్‌ను పరామర్శిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

- ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మార్పీ ఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- రంగరాజన్‌కు నేతల పరామర్శ

మొయినాబాద్ రూరల్: చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ అన్నారు. పలువురు పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం వారు వేర్వేరుగా రంగరాజన్‌ను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, శ్రీకాంత్, కిషన్ పాల్గొన్నారు.

విభేదాలు సృష్టించేందుకే..

రాముడి పేరుతో దాడులు చేయడం సిగ్గుచేటని, నిత్యం దైవ సన్నిధిలో ఉండే వారిపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సరికాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. చిలుకూరు బాలాజీని సందర్శించిన అనంతరం ప్రధాన పూజారి రంగరాజన్‌ను కలిసి దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. హిందువుల మధ్య విభేదాలు సృష్టించాలనే ఇలాంటి కుట్రలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. ఇందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ భీమ్‌భరత్, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలకు సిద్ధమైన జెడ్పీహెచ్ఎస్

సర్కారు బడిలో స్వర్ణోత్సవాలు

చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలకు సిద్ధమవుతోంది. గత యాభై ఏళ్లుగా ఇక్కడ కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దీనికి ఆదివారం మహూర్తం ఖరారు చేశారు. ఈ స్కూల్‌లో అక్షరాలు దిద్ది ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న ఎంతో మంది తమ చిన్ననాటి మిత్రులతో కలిసి సందడి చేయనున్నారు.

- సంబరాలకు సిద్ధమైన చేవెళ్ల జెడ్పీహెచ్ఎస్
- 70 వసంతాల పాఠశాలలో.. 50 ఏళ్ల వేడుక
- రేపు కలుసుకోనున్న బాల్యమిత్రులు

చేవెళ్ల: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలో 1955లో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రారంభించారు. నేటికి ఏడు దశాబ్దాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా 1955 నుంచి 2005 వరకు అంటే 50 ఏళ్ల కలిసి చదువుకున్న వారందరూ అపూర్వ కలయిక నిర్వహించాలని నిర్ణంచారు. అనుకున్నదే తడవుగా ఆరు నెలలుగా తీవ్ర కసరత్తు చేశారు. ఆదివారం వేడుకకు ముహూర్తం ఖరారు చేశారు.

అందరిలో ఆతృత

కొంత మంది పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవం నిర్వహించేందుకు కంకణం కట్టుకున్నారు. బాధ్యతగా పాఠశాలలో విద్యనభ్యసించిన వారందరి వివరాలను సేకరించారు. సాంకేతిక సహాయం వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, అందరికీ సమాచారం చేరవేశారు. 50 ఏళ్లలో చదివిన వారందరూ ఆహ్వానితులని పేర్కొంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. సమ్మేళనంలో 1955 నుంచి 1980 వరకు పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఇంత పెద్ద కలయిక కార్యక్రమం ఎలా నిర్వహిస్తారోనని పూర్వ విద్యార్థులతో పాటు.. ప్రాంత ప్రజలు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఆత్మీయ కలయిక, ఉపాధ్యాయులకు సన్మానం, ఏడు దశాబ్దాల గుర్తుగా నిర్వహించే వేడుక తీపి జ్ఞాపకంలా మిగిలిపోవాలని భావిస్తున్నారు.



ప్రచారం చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆరు నెలల శ్రమ

చదువుకున్న పాఠశాలను మరిచిపోవద్దనే ఆలోచనతో 1981– 82 విద్యాసంవత్సరానికి చెందిన బాల్య మిత్రులం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఒక బ్యాచ్ వారే ఎందుకు కలవాలి? ఇక్కడ విద్యనభ్యసించిన వారందరూ ఏకమైతే ఎలా ఉంటుందోనన్న ఆలోచణ వచ్చింది. దీంతో ఆరు నెలలుగా జెడ్పీహెచ్ఎస్ వేదికగా సమీక్ష నిర్వహించాం. కార్యాచరణ రూపొందించాం. స్వర్ణోత్సవాలకు శ్రీకారం చుట్టాం.

– రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా, పూర్వ విద్యార్థి

నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల పరిధిలో పనిచేస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీఓ రతన్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కందనెల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్ కొడంగల్ ఉడిమేశ్వరానికి, జనగాం పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ సంకిరెడ్డిపల్లికి, ఆత్కూర్ పంచాయతీ సెక్రటరీ అర్చన రేగొండి గ్రామానికి, మదనంతపూర్ పంచాయతీ కార్యదర్శి మునీరుద్దీన్ జనగాం గ్రామానికి బదిలీ చేశారు.

నీటి ఎద్దడి రానీయొద్దు

కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

సాక్షి, రంగారెడ్డి: రానున్న వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత ఏఈలతో సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఇంట్రా తాగునీటి సరఫరాలో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్ స్టోరేజీ ఇబ్బందులు, తదితర అంశాలపై కలెక్టర్ డివిజన్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయో గుర్తించి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇంట్రాలో లీకేజీ మరమ్మతులు ఏమైనా ఉంటే సరిచేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ప్రస్తుత నిధులతో పైప్‌లైన్లు, చిన్నచిన్న మరమ్మతులు చేయించి నీటి ఎద్దడిని నివారించాలన్నారు. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా నివాస ప్రాంతాలకు తాగునీరు అందే విధంగా పనులు చేపట్టాలని అన్నారు. నీటి పంపులు, మోటార్లు, వాల్వులు, పైపులకు సంబంధించి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, ఏఈలు, డీఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- ఇబ్రహీంపట్నంలో పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో శుక్రవారం సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఫార్మాసిటీ రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ నిలిపి వేయాలని, ఫార్మాసిటీపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కప్పపహాడ్ గ్రామంలో 98 ఎకరాల బినామీ భూమిని పేదలకు పంపిణీ చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారికే కేటాయించాలని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని, జనాభా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టి, చట్టబద్ధత కల్పించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. దేశ వ్యాప్త కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.భాస్కర్, సామేల్, రాంచందర్, నర్సింహ్మా, కందుకూరి జగన్, జగదీశ్, జిల్లా నాయకులు జంగయ్య, అలంపల్లి నర్సింహ్మా, బుగ్గరాములు, జగన్, బాల్‌రాజ్, దేవేందర్, పెంటయ్య, శేఖర్‌లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: స్వాతంత్య్రం సిద్ధించిన ఇన్నేళ్లలో ఇంకా పేదలు గూడు కోసం పోరు చేయాల్సిన దుస్థితి నెలకొందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలోని 75 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో రెండేళ్లుగా గుడిసెలు వేసుకొని పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అక్కడ రామస్వామి మాట్లాడుతూ.. రెండేళ్లుగా పేదలు గుడిసెలు వేసుకొని ఇళ్ల పట్టాల కోసం పోరాటం చేస్తున్నారని, వారికి ఎర్రజెండా అండగా నిలబడిందన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా పేదలను పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. కనీస సౌకర్యాలు సైతం లేకుండానే రెండేళ్లుగా గుడిసెల్లో పేదలు కాలం వెళ్లదీస్తున్నారన్నారు. పట్టాల కోసం భూపోరాటం చేస్తున్న పేద ప్రజలకు సీపీఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గుడిసెల్లో ఉండే పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు సత్తిరెడ్డి, ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, అంజయ్య, శ్రీనివాస్, జంగయ్య, మక్బుల్, మంజుల, శివ, సుగుణమ్మ, రమాదేవి, పెంటయ్య, శ్రీకాంత్, యాదగిరి, గుడిసెవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

ఐదుగురికి గాయాలు



ఘటనా స్థలిలో దెబ్బతిన్న బస్సు, లారీ

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని పరిగి రోడ్డులో పోచమ్మ దేవాలయం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌కు వెళ్లేందుకు షాద్‌నగర్ డిపో నుంచి బయలుదేరింది. పరిగి రోడ్డులో పోచమ్మ దేవాలయం వద్ద బస్సును డ్రైవర్ యూటర్న్ తీసుకుంటుండగా షాద్‌నగర్ వైపు వస్తున్న లారీ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనంతరెడ్డికి కాలు విరగగా ప్రయాణికులు సుబ్రమణ్యస్వామి, కమ్మరి బాలమణి, జంపుల బాలమణి, అవుసుల సత్యమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎం ఉష, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బస్సు కండక్టర్ శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ అనంతరాములు తెలిపారు.

ఆ ఇద్దరూ అమన్, అలోక్!

బీదర్, అఫ్జల్‌గంజ్ కాల్పులు వీరి పనే

- ఇరువురిదీ బీహార్‌లోని వైశాలీ జిల్లానే
- రూ.5 లక్షల రివార్డు ప్రకటించిన కర్ణాటక
- 2023 నుంచి యూపీ పోలీసులకూ వాంటెడ్



సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకలోని బీదర్, నగరంలోని అఫ్జల్‌గంజ్‌లో తుపాకులతో విరుచుకుపడిన ఇద్దరు దుండగులు బీహార్‌లోని వైశాలీ జిల్లా, ఫతేపూర్ పుల్వారియాకు చెందిన అమన్ కుమార్, అలోక్ కుమార్‌గా తేలింది. వీరిపై కర్ణాటక పోలీసులు రూ.5 లక్షల రివార్డు సైతం ప్రకటించారు. ఈ మేరకు లుక్ ఔట్ నోటీసులు రూపొందించి దేశ వ్యాప్తంగా అన్ని నగరాలకు పంపారు. ఈ గ్యాంగ్‌లో మొత్తం నలుగురు ఉండే వారని, 2023లో ఉత్తరప్రదేశ్‌లో ఇదే తరహా నేరానికి పాల్పడినట్లు బీదర్ అధికారులు చెబుతున్నారు.

మీర్జాపూర్‌లోనూ ఓ గార్డు హత్య...

ఈ గ్యాంగ్ బైక్‌లపై తిరుగుతూ, పట్టణ శివార్లలో రెక్కీ చేసి, ఏటీఎం మిషన్లలో నగదు నింపే వాహనాలనే టార్గెట్‌గా చేసుకుంటోంది. అలోక్ కుమార్ నేతృత్వంలో సాగే ఈ ముఠాలో అమన్, చందన్ కుమార్, రాజీవ్ సాహ్ని సభ్యులుగా ఉండేవారు. వీళ్లు 2023 సెప్టెంబర్ 12న ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లో పంజా విసిరారు. రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్లి యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం మిషన్లలో నగదు నింపే వాహనంపై దాడి చేసి కాల్పులు జరిపారు. పట్టపగలు, నడిరోడ్డుపై సెక్యూరిటీ గార్డు జై సింగ్‌ను హత్య చేసి రూ.40 లక్షలు ఉన్న ట్రంకు పెట్టెతో ఉడాయించారు. ఈ కేసు కొలిక్కి తీసుకురావడానికి ఉత్తరప్రదేశ్ పోలీసులు ప్రత్యేకంగా ఓ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) ఏర్పాటు చేసింది. అప్పట్లో ఈ గ్యాంగ్‌లో ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డు ప్రకటించింది.

ఎస్టీఎఫ్‌కు ఇద్దరు మాత్రమే చిక్కారు...

ఒక ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, 30 మంది సిబ్బందితో ఏర్పాటైన ఈ ఎస్టీఎఫ్ దాదాపు ఏడాది పాటు దేశ వ్యాప్తంగా గాలించింది. ఎట్టకేలకు గత ఏడాది సెప్టెంబర్‌లో చందన్ కుమార్‌ను ముంబైలో, రాజీవ్ సాహ్నిని వైశాలీలో పట్టుకుంది. అప్పట్లో అమన్, అలోక్‌లు వైశాలీ జిల్లాలోని మహిసౌర్ జనధన్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వీరి కోసం వేట ముమ్మరం చేయగా... ఇరువురూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆపై బీహార్‌లోనూ ఈ ద్వయం పలు నేరాలు చేసినట్లు తేలింది. చివరకు గత నెల 16న బీదర్‌లో పంజా విసిరింది. ఎస్బీఐ ఏటీఎం మిషన్లలో నగదు నింపే సీఎంఎస్ సంస్థ ఉద్యోగి గిరి వెంకటేష్‌ను చంపి, శివకుమార్‌ను గాయపరిచి రూ.83 లక్షలతో ఉడాయించారు. నగరంలో షెల్టర్ తీసుకున్న అమన్, అలోక్ నగదుతో తిరిగి ఇక్కడికే వచ్చి నేరానికి వాడిన ద్విచక్ర వాహనాన్ని ఎంజీబీఎస్ పార్కింగ్‌లో ఉంచారు.

రివార్డు ప్రకటించిన కర్ణాటక పోలీసులు...

అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ నుంచి ప్రైవేట్ బస్సులో రాయ్‌పూర్ వెళ్లేందుకు అమిత్‌కుమార్ పేరుతో టిక్కెట్ బుక్ చేసుకున్నారు. అక్కడ జరిగిన పరిణామాలతో మేనేజర్ జహంగీర్‌పై కాల్పులు జరపడం, పారిపోవడం జరిగిపోయాయి. ఈ హత్యాయత్నం ఘటనపై అఫ్జల్‌గంజ్ ఠాణాలోనూ కేసు నమోదైంది. ఈ దోపిడీ దొంగలు నగరం నుంచి కడప, నెల్లూరు మీదుగా చెన్నై వరకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆపై వీరి కదలికలు కనిపెట్టడం కష్టసాధ్యంగా మారింది. దీంతో వీరిపై కర్ణాటక పోలీసులు రూ.5 లక్షల చొప్పున రివార్డు ప్రకటించారు. ఈ మేరకు జారీ చేసిన లుక్ ఔట్ నోటీసుల్లో దుండగుల ఫొటోలను జత చేశారు. వీరికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు కలబురిగి డీఐజీ (9480800030) లేదా బీదర్ ఎస్పీ (9480803401) లేదా బీదర్ డీఎస్పీలకు (9480803420) సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తి గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

దివ్యాంగుడిపై దాడి.. కేసు నమోదు

షాద్‌నగర్‌రూరల్: దివ్యాంగుడిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని లక్ష్మీనర్సింహ కాలనీకి చెందిన దివ్యాంగుడైన ఆర్ఎన్.రవీందర్ ఈ నెల 6న ఇంట్లో ఉన్నాడు. ఆ సమయంలో సీఎస్కేలో నివాసం ఉంటున్న గోపాల్ అకారణంగా రవీందర్ ఇంట్లో ప్రవేశించి దుర్భాషలాడుతూ దాడి చేశాడు. దీంతో అడ్డుకోబోయిన రవీందర్ తల్లి రాధాబాయిని నిలువరించి దుర్భాషలాడాడు. ఈ వ్యవహారంపై రవీందర్ ఫిర్యాదు చేయగా.. పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇరువర్గాలపై..

మీర్‌పేట: హోటల్ వద్ద జరిగిన గొడవలో ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్ పంచాయతీరాజ్ కాలనీకి చెందిన సిద్ధాంతి వీరేష్(26) సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. గురువారం మధ్యరాత్రి 12 గంటలకు విధులు ముగించుకుని హస్తినాపురం జెడ్పీ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా దావత్ బిర్యాని హౌస్‌లో పనిచేసే అభిషేక్‌దాస్ ఫోన్‌లో మాట్లాడుతూ ఆవేశంగా నేలకేసి కొట్టడంతో వీరేష్ కాలుకు తగిలింది. దీనిపై వీరేష్, అతని అన్న గౌరిశంకర్‌లు ప్రశ్నించగా హోటల్‌లో పనిచేసే కొంతమంది బయటకు రావడంతో గొడవకు దారితీసింది. ఈ వ్యవహారంపై ఇరువురు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పంచాయతీ బోరు వాడొద్దనందుకు..

కార్యదర్శిపై దూషణ.. కేసు నమోదు

మహేశ్వరం: విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిని దూషించినందుకు ఓ వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి సిద్ధులు గ్రామంలో పంచాయతీ నిధులతో వేసిన బోరు నీళ్లను కొన్ని రోజుల నుంచి తన సొంత పొలానికి వాడుకుంటున్నాడు. శుక్రవారం వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో బోరు నీటిని వ్యక్తిగతంగా వాడుకోవద్దని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. దీంతో కోపోద్రిక్తుడైన సిద్ధులు ఆగ్రహంతో ఊగిపోయి ఫోన్‌లో అసభ్యకరంగా దూషించాడు. 'నా సొంత డబ్బులు వెచ్చించి బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించాను. నేనే వాడుకుంటానని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో' అని పంచాయతీ కార్యదర్శిని అసభ్యకరంగా దూషించాడు. దీంతో శ్రీనివాస్ మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిద్ధులుపై కేసు నమోదు చేశామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఘటనపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తీవ్రంగా ఖండించి, దూషించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతు అదృశ్యంపై కేసు నమోదు



యాదయ్య (ఫైల్)

చేవెళ్ల: బ్యాంకులో డబ్బులు తీసుకు వస్తానని ఓ రైతు ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజులుగా ఆచూకీ లేకపోవటంతో భార్య చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. షాబాద్ మండలంలోని ఎట్లా ఎర్రవల్లి గ్రామానికి చెందిన రైతు బోడ యాదయ్య(48) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 10వ తేదీన ఇంట్లో భార్యకు చేవెళ్లలో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకులో డబ్బులు తీసుకు వస్తానని చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారిని అడిగిన ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐసీసీసీని సందర్శించిన గూగుల్ బృందం

సాక్షి, సిటీబ్యూరో: గూగుల్ ఇండియా ప్రతినిధుల బృందం శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీసు ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను (ఐసీసీసీ) సందర్శించింది. కీలక రంగాల్లో టెక్నాలజీ వినియోగంపై ఇటీవల గూగుల్ సంస్థకు తెలంగాణ ప్రభుత్వానికి మధ్య ఒప్పందం కుదిరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఐసీసీసీకి వచ్చిన బృందం ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థపై అధ్యయనం చేసింది. నగర కొత్వాల్ సీవీ ఆనంద్ వీరికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గూగుల్ మ్యాప్స్‌కు సంబంధించిన లైవ్ ట్రాఫిక్ డేటాను ఐసీసీసీతో అనుసంధానం చేయడం, వాహనాల స్థితిని ఆధారంగా చేసుకుని ఆటోమేటెడ్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అభివృద్ధి చేయడం, ఎప్పటికప్పుడు గస్తీ వాహనాల ట్రాకింగ్, ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం డ్రోన్ వినియోగం తదితర అంశాలపై గూగుల్ ప్రతినిధులతో కొత్వాల్ ఆనంద్ చర్చించారు. దీనికి సంబంధించి గూగుల్ పలు సలహాలు, సూచనలు అందించింది.

చెరువులో దూకిన మహిళను కాపాడిన పోలీసులు



పెద్ద చెరువులో దూకిన మహిళను రక్షించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: స్థానిక పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ మహిళను ఎస్‌డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు శుక్రవారం రాత్రి కాపాడారు. ఈ ఘటనకు సంబంధించి ఏసీపీ కేపీవీ రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నం చెరువు వద్ద ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుందని రాత్రి 100కు కాల్ వచ్చింది. విధుల్లో ఉన్న పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే స్పాట్‌కు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో చెరువు కట్ట వద్ద ఉన్న 3వ బెటాలియన్ ఎస్‌డీఆర్ఎఫ్ కానిస్టేబుల్ జగదీశ్ చెరువులో దూకిన మహిళను గమనించి కాపాడేందుకు యత్నించారు. అంతలో అక్కడికి చేరుకున్న పెట్రో మొబైల్ కానిస్టేబుల్ డ్రైవర్ రాజు, స్థానికులు ఆమెను చెరువులో నుంచి బయటకు తీశారు. అప్పటికే ఆమె నీళ్లు తాగడంతో అక్కడున్న ఓ డాక్టర్ ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఇబ్రహీంపట్నంకు చెందిన తాటిపల్లి అంజమ్మ(40)గా గుర్తించారు. ఈమె ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. మహిళ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్స్‌ను ఏసీపీ అభినందించారు.

యువతికో ఫోల్డర్..

- 44 మంది యువతులు, 250కి పైగా వీడియోలు
- కొనసాగుతున్న మస్తాన్ సాయి విచారణ
- రంగంలోకి నార్కొటిక్స్ విభాగం అధికారులు
- హార్డ్ డెస్క్‌లో విస్తుపోయే వీడియోలు డాటాను రీ ఇన్‌స్టాల్ చేస్తున్న పోలీసులు



మస్తాన్‌సాయి

మణికొండ: నగ్న వీడియోలు, బ్లాక్‌మెయిలింగ్, డ్రగ్స్, అత్యాచారం, హత్యాయత్నం ఆరోపణలు ఎదుర్కొంటున్న మస్తాన్‌సాయిని కస్టడీలోకి తీసుకున్న నార్సింగి పోలీసులు విచారణ చేపట్టారు. రెండో రోజు శుక్రవారం క్రైం పోలీసులతో పాటు సైబరాబాద్ నార్కొటిక్స్ విభాగం సైబరాబాద్ ఇన్‌చార్జి హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు అతడిని విచారించారు. ఈ సందర్భంగా మస్తాన్‌సాయిని డ్రగ్స్ ఎక్కడి నుంచి తెప్పిస్తావు, ఎంత మందికి ఇచ్చావు, డ్రగ్స్ అలవాటు చేసిన యువతులపై ఎందుకు అత్యాచారం చేశావని, అలా ఎంత మందిని చేశావు, నగ్న వీడియోలను తీయాల్సిన అవసరం ఏమిటని, లావణ్యను ఎందుకు హత్య చేయాలనుకున్నావని ప్రశ్నించినట్లు తెలిసింది. తన హార్డ్ డిస్క్‌లో లావణ్య ఆరోపించినట్లు వేల సంఖ్యలో వీడియోలు లేవని, తన భార్యతో పాటు ఇద్దరు గర్ల్‌ఫ్రెండ్స్‌వి మాత్రమే ఉన్నాయని మరోసారి బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. దాంతో హార్డ్‌డెస్క్‌ను అతడి ముందే ఓపెన్ చేసిన పోలీసులు అవాక్కయ్యారు. అందులో ఒక్కో యువతికి సంబంధించి ఒక్కో ఫోల్డర్ రూపంలో వాట్సాప్ చాట్స్, ఆడియో, వీడియో, స్క్రీన్ రికార్డింగ్‌లను భద్రపర్చినట్లు పోలీసులు గుర్తించారు. హార్డ్‌డిస్క్‌లో 44 మంది యువతులకు సంబంధించి 250కి పైగా వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. తన విల్లాలోని బెడ్‌రూంలో సీక్రెట్‌గా ఏర్పాటు చేసిన ఐదు కెమెరాలతో వీటిని తీసినట్లు విచారణలో మస్తాన్‌సాయి అంగీకరించినట్లు సమాచారం. లావణ్య ఇంట్లోనూ తీసిన వీడియోలు, చాట్ డాటా అతడి సెల్‌ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాటి ఆధారంగా అతడిని ప్రశ్నించినట్లు తెలిసింది. తన మిత్రుడు వినీత్‌రెడ్డి తనకు డ్రగ్స్ సరఫరా చేసేవాడని, పార్టీలు ఉన్నపుడు అతడి వద్ద కొనుగోలు చేసే వాడినని మస్తాన్‌సాయి వెల్లడించినట్లు సమాచారం. దీంతో వినీత్‌రెడ్డిని అరెస్టు చేసి, మరోమారు విచారించాలని నార్కొటిక్స్ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. రెండో రోజు విచారణలో మస్తాన్‌సాయి యువతులను డ్రగ్స్ పార్టీల ద్వారా మచ్చిక చేసుకుని వారిని లైంగికంగా వాడుకున్నానని అంగీకరించినట్లు సమాచారం. శనివారం మధ్యాహ్నం వరకు పోలీసులు అతడి మరింత లోతుగా విచారించనున్నారు. అప్పటికీ తమకు రావాల్సిన సమాచారం రాకపోతే శనివారం మరో సారి కస్టడీ పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

కులగణన లెక్కలు వెల్లడించండి

యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్



మాట్లాడుతున్న దామోదర్‌యాదవ్

షాద్‌నగర్: ప్రభుత్వం యాదవుల జనాభా గణాంకాలను వెల్లడించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో అగ్రకుల జనాభా అత్యంత తక్కువగా ఉన్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. రాష్ట్ర జనాభాలో యాదవులు అధికశాతం మంది ఉన్నారన్నారు. అయితే ప్రభుత్వం యాదవుల సంఖ్య తక్కువగా ఉందని చూపించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఇటీవల నిర్వహించిన కుటుంబ సర్వే ఫలితాలను కులాల వారీగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీల సంఖ్యను తక్కువగా చూపించి వారి రాజకీయ, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను దెబ్బ తీసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. రిజర్వేషన్ల విషయంలో తమకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజన్ యాదవ్, నాయకులు తిరుమలేష్, చెన్నకేశవులు, నర్సింగ్‌యాదవ్, సాయికుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

శంషాబాద్ రూరల్: జూకల్ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం మాజీ మంత్రి పి.సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పి.జంగారెడ్డి ఆధ్వర్యంలో వీరు పార్టీ తీర్థం తీసుకున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని సబితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.రఘు, వాజిద్, అంజిగౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీపతిరెడ్డి, రవి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: హైదర్షాకోట్ శాంతినగర్ కాలనీ రోడ్ నెంబర్-3 వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ..గృహ అవసరాల నీటి కోసం బోర్ల ద్వారా మాత్రమే ఆధారపడి ఉన్నామన్నారు. వేసవి కాలం మొదలవడంతో బోర్లు ఎండిపోతున్నాయన్నారు. జలమండలి అధికారులు నాలుగు రోజులకు ఒకసారి అది కూడా కేవలం ఒక గంట మాత్రమే నీటిని వదులుతున్నారన్నారు. రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కె.నాగేష్, ప్రధాన కార్యదర్శి ఏ.వినయ్‌కుమార్‌గౌడ్, కోశాధికారి పి.కోటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అమర్‌సింగ్, మనోహర్ పాల్గొన్నారు.

వేసవి రాకముందే నీటి కష్టాలు..

వేసవి రాకముందే నీటి కష్టాలు ప్రారంభమయ్యాయని ఈ సమస్యను పరిష్కరించేందుకు జలమండలి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావుల కొళ్ల నాగరాజ్ కోరారు. నీటి కటకటపై జలమండలి అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటత్లాడుతూ..బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాధవీనగర్ కాలనీ, పీజీ కాలనీ ఇతర కాలనీల వాసులకు నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో నీటి దాహార్తిని తీర్చాలని నీటి ఎద్దడి తలెత్తకుండా పరిష్కారం చూపాలన్నారు. హిమాయత్‌సాగర్ నుంచి వాటర్ వస్తాయని ఈ మధ్యనే వాటర్ గ్రిడ్ ప్రారంభోత్సవం చేశారన్నారు. మరి ఎందుకు వాటర్ రావడం లేదన్నారు. గతంలో కేసీఆర్ సర్కార్ మిషన్ భగీరథతో తాగునీటి కష్టాలు తీర్చిందని మండు వేసవిలోనూ నీటి కష్టాలు లేకుండా తాగునీటి కష్టాలు తీర్చిందని గుర్తుచేశారు. మార్చి, ఏప్రిల్, మే నెలలో తమ పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి వాటర్ సమస్య లేకుండా రోజు విడిచి రోజు నీళ్లు సక్రమంగా విడుదల చేయాలని అధికారులను కోరారు.